andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3 । కనిష్ఠం 18.7
నిర్మల్
జిల్లా వార్తలు
8
బుధవారం 31 జనవరి 2024



సేవారత్న నేషనల్ అవార్డుకు ఎంపిక

నిర్మల్ కల్చరల్, జనవరి 30 : సేవారత్న నేషనల్ అవార్డుకు నిర్మల్‌కు చెందిన సంఘ సేవకులు తలారి రాజేశ్వర్ ఎంపికయ్యారు. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ మంగళవారం ఈ విషయాన్ని ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆహ్వానపత్రాన్ని అందించారు. ఫిబ్రవరి 11న తిరుపతిలో జరిగే నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డు అందజేయనున్నట్లు ప్రకటించారు. సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిఏటా ఉద్యమకారులు, సంఘ సంస్కర్తలు, కవులు, రచయితలకు ఈ అవార్డు అందజేయనున్నట్లు తెలిపారు.

డి-1 పై విచారణ పర్వం



న్యూ సాంగ్వి ఎక్స్ రోడ్‌పై ధర్నా చేస్తున్న రైతులు (ఫైల్)

అక్రమ డీ-1 పట్టాలకు వ్యతిరేకంగా జిల్లా కలెక్టరేట్‌లో సిద్దిలకుంట గ్రామస్థుల ఆందోళన (ఫైల్)

- రంగంలోకి జిల్లా కలెక్టర్ సంగ్వాన్
- ఇద్దరు సిబ్బందితో పాటు మరికొంతమంది వ్యవహారంపైనా నిఘా
- వేరు వేరుగా రెండు కమిటీల ఏర్పాటు
- నిజామాబాద్ స్పెషల్ కలెక్టర్ ఆఫీసులో రికార్డుల సేకరణ
- సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసులో రికార్డులపై ఆరా
- అక్రమార్కులపై ఉక్కుపాదం
- రహస్యంగా కూపీలాగుతున్న జిల్లా యంత్రాంగం

నిర్మల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీ ఎత్తున జరిగిన డి-1 పట్టాభూముల కుంభకోణంపై పకడ్బందీగా విచారణ జరిపేందుకు కలెక్టర్ స్వయంగా రంగంలోకి దిగారు. గత కొంతకాలం నుంచి వస్తున్న ఆరోపణలతో పాటు బాధితుల నుంచి అందిన ఫిర్యాదులు, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఈ వ్యవహారంపై సీరియస్‌గా వ్యవహరిస్తుండడాన్ని పరిగణలోకి తీసుకున్న కలెక్టర్ ఇక తన కొరఢా ఝులిపించేందుకు నడుం బిగించారంటున్నారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పరిపాలనలో నిక్కచ్చిగా, నిజాయితీగా వ్యవహరిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. గతానికి భిన్నంగా ఆయన అన్ని శాఖల అధికారులతో సఖ్యతగా ఉంటూనే పరిపాలనలో లోపాలు లేకుండా చూస్తున్నారు. దీంతో పాటు ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు తలెత్తకుండా అన్నిశాఖల అధికారులకు ఇప్పటికే ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. అన్ని రకాల ఫైల్స్ విషయంలో కలెక్టర్ ఆచితూచి వ్యవహరిస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే గత కొద్దిరోజుల నుంచి జిల్లాను కుదిపేస్తున్న నకిలీ డి-1 పట్టాల వ్యవహారంపై ఆయన ఇక తన ప్రతాపం చూపేందుకు సిద్ధమవుతున్నారంటున్నారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఈ అక్రమాల వ్యవహారంపై సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు స్వయంగా ఫిర్యాదు చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తనదైన శైలిలో విచారణకు రంగం సిద్ధం చేశారు. ఇందులో భాగంగానే నిజాయితీ గల కొంతమంది అధికారులతో కూడిన రెండు విచారణ బృందాలను నియమించడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఈ అక్రమాలకు అసలు సూత్రధారులుగా సర్వే ల్యాండ్ రికార్డ్స్‌కు సంబంధించిన ఇద్దరు జూనియర్ అసిస్టెంట్ స్థాయి సిబ్బందితో పాటు గతంలో ఇక్కడ పని చేసి ప్రస్తుతం ఇదే జిల్లాలోని మరో మండలంలో పని చేస్తున్న సర్వేయర్‌పై పెద్దఎత్తున ఉన్న ఫిర్యాదులను కూడా కలెక్టర్ సీరియస్‌గా తీసుకుంటున్నారు. ఇప్పటికే వీరిపై ఎమ్మెల్యేతో పాటు బాధితులు కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. అలాగే వీరిపై సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం విక్రమార్కకు సైతం ఫిర్యాదులు చేశారు. వీరి నకిలీ దందాలతో పాటు ఈ దందాలతో కూడగట్టిన ఆస్థులు, వారి బినామీ ఆస్థులపై ఇప్పటికే ఆధారాలతో సహా ఏసీబీకి ఫిర్యాదులు అందినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే జిల్లా కలెక్టర్ ఇక అక్రమార్కులపై తాడోపేడోకు సిద్ధమయ్యారంటున్నారు. నిజాయితీ గల అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీలోని ఇద్దరు సభ్యులు ఇప్పటికే డి-1 పట్టాలకు సంబంధించి నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విచారణ కమిటీ పరిశీలన వ్యవహారాన్ని కలెక్టర్ గోప్యంగా ఉంచుతున్నట్లు తెలుస్తోంది. అలాగే నిర్మల్‌లోని రెవెన్యూ కార్యాలయంతో పాటు సర్వేల్యాండ్ రికార్డ్స్ ఏడీ కార్యాలయంలో గల రికార్డులను సైతం కమిటీ సభ్యులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అయితే ఏడీ ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసులో కొంతమంది దళారులు చాలా ఏళ్ల నుంచి రికార్డులను, సమాచారాన్ని లీక్ చేస్తూ ఈ దందాను నడిపినట్లు ఆరోపణలున్నాయి. దీని కారణంగా కలెక్టర్ మొత్తం విచారణ ప్రక్రియను అత్యంత రహస్యంగా జరిపిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో పాటు ఆయన స్వయంగా కూడా 2014 సంవత్సరం నుంచి 2018 సంవత్సరం వరకు జరిగిన డి-1 అక్రమ పట్టాల దందాపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారంటున్నారు. మరోవారం పదిరోజుల్లో 2014 నుంచి 2018 వరకు జరిగిన డి-1 పట్టాల అక్రమాల వ్యవహారాన్ని కలెక్టర్ నిగ్గు తేల్చి సంబంధిత అధికారులు, సిబ్బందితో పాటు రిటైర్డ్ అయిన అధికారులపైనా మరో జిల్లాకు బదిలీ అయిన సిబ్బందిపైనా కూడా కఠినచర్యలు తీసుకునేందుకు కలెక్టర్ రంగం సిద్ధం చేస్తున్నారంటున్నారు.

ఇంటి దొంగలపైనే నజర్

కాగా భారీ ఎత్తున సాగిన డి-1 పట్టాల అక్రమ వ్యవహారం వెనక సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాత్ర ఉందన్న అంశాన్ని జిల్లా కలెక్టర్ సీరియస్‌గా పరిగణిస్తున్నారంటున్నారు. ఇందులో భాగంగానే కలెక్టర్ మొదట ఇంటి దొంగల లెక్కలను తీసేందుకు రంగం సిద్ధం చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపేందుకు కలెక్టర్ శోధన మొదలుపెట్టారంటున్నారు. ఓ సర్వేయర్‌తో పాటు ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌ల పాత్రపై పెద్దఎత్తున ఆరోపణలు ఉన్న క్రమంలో కలెక్టర్ వీరి వ్యవహార శైలిపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. అలాగే పలువురు ఇప్పటికే వీరి అక్రమ ఆస్తులు, బినామీ ఆస్తులపై కూడా ఫిర్యాదులు చేయడంతో కలెక్టర్ ఆ కోణంలో కూడా విచారణ జరిపేందుకు రంగం సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. ఇతర చోట్ల పని చేస్తూ కూడా ఇక్కడి ఏడీ కార్యాలయంలోనే తిష్ట వేసి ఈ అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కూడా కలెక్టర్ సీరియస్‌గా వ్యవహరించనున్నట్లు సమాచారం. అయితే కలెక్టర్ ఓ వైపు, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మరోవైపు అక్రమార్కుల వ్యవహారంపై సీరియస్‌గా వ్యవహరిస్తున్న నేపథ్యంలో వీరంతా రికార్డులను సైతం తారుమారు చేసే పనిలో ఉన్నారంటున్నారు. ఇప్పటికి ఇక్కడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కార్యాలయంలో పెత్తనం చెలా యిస్తున్న వీరు విచారణ నుంచి తప్పించుకునే ప్రయత్నాలు కూడా మొదలుపెట్టారంటున్నారు.

రంగంలోకి కమిటీలు

ఇదిలా ఉండగా జిల్లా కలెక్టర్ డి-1 పట్టాల అక్రమాల వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకోవడమే కాకుండా చర్యలకు సైతం రంగం సిద్ధం చేస్తుండడంతో అక్రమార్కుల గుండెల్లో దడ మొదలైందంటున్నారు. జిల్లా కలెక్టర్ డి-1 పట్టాల అక్రమాల వ్యవహారంపై ప్రత్యేకంగా అధికారులతో కూడిన రెండు కమిటీలను నియమించడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఇప్పటికే ఓ కమిటీ నిజాయిబాద్ జిల్లాలోని సంబందిత డి-1కు సంబందించిన ఆఫీసులో రహస్యంగా రికార్డులను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అధికారులు గత మూడురోజుల నుంచి తమదైన శైలిలో డి-1 పట్టాలతో పాటు సర్వేనంబర్‌ల ఆధారంగా రికార్డులను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే డి-1 పట్టాల అక్రమార్కులకు నిజామాబాద్ కార్యాలయంలోని కొంతమంది సిబ్బందితో సంబంధాలున్న కారణంగా వారి ద్వారా తమ గుట్టు బయట పడకుండా చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు పేర్కొంటున్నారు. అలాగే మరోకమిటీ కూడా నిర్మల్‌లోని రెవెన్యూ, సర్వేల్యాండ్ రికార్డ్స్ ఆఫీసుల్లోని రికార్డులను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మొత్తానికి జిల్లాలో జరిగిన డి-1 పట్టాల అక్రమ దందా వ్యవహారం రోజురోజుకు కొత్త మలుపులు తిరుగుతోందని అంటున్నారు. ఇక స్వయంగా అటు ఎమ్మెల్యే ఇటు కలెక్టర్‌లు రంగంలోకి దిగి మొత్తం వ్యవహారాన్ని నిగ్గు తేల్చే పనిలో నిమగ్నమవ్వడంతో అక్రమార్కులపై చర్యలు తప్పవన్న ప్రచారం జరుగుతోంది.

తిరుమల శ్రీవారిని

దర్శించుకున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ కల్చరల్, జనవరి 30 : నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సోమవారం తిరుమలలో కొలువైన శ్రీ వెంకటేశ్వరస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో మొక్కులు తీర్చుకొని వేద పండితుల ఆశీర్వచనం పొందారు. ఆలయ అధికారులు ప్రసాదాన్ని అందజేశారు.



తిరుమలలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు

బాసర, జనవరి, 30: బాసర సరస్వతి అమ్మవారి హుండీ కానుకలను మంగళవారం ఆలయ అధికారులు లెక్కింపు చేపట్టారు. రూ. 84,70,278 ల నగదు, మిశ్రమ బంగారం 142 గ్రాములు, మిశ్రమ వెండి 4 కిలోల 640 గ్రాములు వివిధ దేశాలకు చెందిన కరెన్సీలు 114 హుండీల్లో వచ్చాయి. ఈ ఆదాయం మొత్తం 77 రోజుల్లో సమకూరింది.

2న ఇంద్రవెల్లిలో కాంగ్రెస్ రణభేరి

- సభకు హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు వెల్లడి

నిర్మల్ కల్చరల్, జనవరి 30 : వచ్చే 12వ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఫిబ్రవరి 2న ఖానాపూర్ నియోజకవర్గం ఇంద్రవెల్లిలో రణభేరి సభ నిర్వహిస్తున్నట్లు నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు తెలిపారు. మంగళవారం ఆయన ఇంద్రవెల్లిలో జరిగే సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని ఇంద్రవెల్లి నుండే పూరిస్తారన్నారు. సీఎం హాజరయ్యే సభకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి లక్ష మందికి పైగా జనం హాజరయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికల స్ఫూర్తితో పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించేలా వ్యూహరచన ఉంటుందన్నారు. కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్సై

ముథోల్, జనవరి 30 : ప్రతి ఒక్కరూ వ్యాపార కేంద్రాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ముథోల్ ఎస్సై సాయి కిరణ్ అన్నారు. మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామ సమీపంలో అంజని పుత్ర రైస్ మిల్లు ఆధ్వర్యంలో ఉన్న రైస్ మిల్లు వద్ద, రోడ్డు పక్కన బిగించిన సీసీ కెమెరాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ప్రతి గ్రామంలో, వ్యాపార కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేర నియంత్రణకు ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామాల్లో గ్రామస్థులు సహాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రాథోడ్, ఉప సర్పంచ్ ఉదయ్ కుమార్, నాయకులు సాయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కత్తిపోట్లకు గురైన వ్యక్తికి శస్త్రచికిత్స

నిర్మల్ కల్చరల్, జనవరి 30 : ఇటీవల కత్తిపోట్లకు గురై గాయాలతో వచ్చిన వ్యక్తికి శస్త్ర చికిత్స చేసి కాపాడారు. బంగల్‌పేట్‌కు చెందిన వెంకటేష్ దాడికి గురై కత్తిపోట్లతో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. డాక్టర్ రమ్య, గణేష్ బాధితుడికి శస్త్ర చికిత్స చేశారు. బాధితుడికి మెరుగైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాపాయం నుండి కాపాడినట్లు వైద్యులు తెలిపారు.

మహాత్మాగాంధీకి ఘన నివాళులు

నిర్మల్ కల్చరల్, జనవరి 30 : జాతిపిత మహాత్మా గాంధీకి జిల్లా ఎస్పీ జానకి షర్మిల మంగళవారం ఘన నివాళులర్పించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గాంధీ వర్థంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయనను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భారతీయుల హృదయాలలో స్వదేశీ, స్వభాషా, స్వరాజ్ అనే స్ఫూర్తి నింపారన్నారు. స్వాతంత్ర్య సాధన కోసం పోరాటం చేసి అసువులు బాసారని అన్నారు. త్యాగధనులను స్మరించుకోవడం దేశ పౌరులుగా ప్రతి ఒక్కరిపై బాధ్యత ఉంటుందన్నారు. గాంధీజీ చూపిన బాటలో నడిచి ఆయన ఆశయసాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. డీసీఆర్బీ డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సూపరిండెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఎస్పీ షర్మిల

'సాగునీటి వ్యవస్థ మెరుగుదలకు నిధులు కేటాయించాలి'



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్

భైంసా, జనవరి 30 : భారీ వర్షాల మూలంగా దెబ్బతిన్న ప్రాజెక్టులు, చెరువుల మరమ్మతుల కోసం , సాగు నీటి వ్యవస్థ మెరుగుదల కోసం నిధులు కేటాయించాలని ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని కలిసి మాజీ ఎమ్మెల్యే పాటిల్ ముథోల్ నియోజక వర్గ పరిధిలో దెబ్బతిన్న, కోతకు గురైన సిరాల ప్రాజెక్టుతో పాటు ఆయా ప్రాంతాల్లోని చెరువుల వివరాలను అందచేశారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు సమస్యలను వివరించారు. గుండేగాం ముంపు బాధితుల అవస్థలను తెలిపారు. చెరువుల కాలువలు మరమ్మత్తులకు నోచుకోక రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి ఇక్కట్లను పేర్కొన్నారు. సంబంధిత సమస్యల పరిష్కారం కోసం గాను అవసరమైన మేర నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాగునీటి వసతి మెరుగుదలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వివరించారు. త్వరలోనే ప్రాధాన్యతానుసారం చెరువులు, ప్రాజెక్టుల మరమ్మత్తులకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించనున్నట్లుగా పేర్కొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో కాలువ భూమి హద్దుల గుర్తింపు

నర్సాపూర్(జి), జనవరి 30 : ఇరిగేషన్ శాఖా, రెవెన్యూశాఖ అధికారులు కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం సర్వేచేసి హద్దులను చూపించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని దేవుని చెరువు కాలువ గంగం వెంకట భూమేశ్వర్‌రెడ్డి పంట భూమి నుంచి ఉంది. వాస్తవాన్ని పొరపాటుగా మోస పూరితంగా తప్పుగా చూపించి నాలా అనుమతి ఇచ్చిన తహసీల్దార్, గిర్దావర్, సర్వేయర్ పై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రానికి చెందిన అప్పాల రాజగంగుబాయి, పోశెట్టి, సట్ల సాయవ్వ, కర్రెన్న, దడికె రమేష్, జంగం రాజేశ్వర్ రైతులు ఫిర్యాదు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సోమ శ్రీనివాస్ మాట్లాడతూ నాలా అనువతులు పొందిన భూయజమానిపై మూడు నెలలలోపు రెవిన్యూ డివిజనల్ అధికారికి అప్పీలు చేసుకుంటే వాస్తవాన్ని పొరపాటుగా చూపించి పొందిన నాలా అనుమతులను రద్దు చేసే అధికారం ఉంటుందని అన్నారు. నాలాలను ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సోమ శ్రీనివాస్, సర్వేయర్ మోహన్ క్రిష్ణా, గిర్దావర్ వేణుగోపాల్, ఇరిగేషన్ ఇంజనీర్ గంగాధర్, సర్పంచ్ అర్గుమీది రాంరెడ్డి, గ్రామస్థులు శుభచరణ్, కొంద్రరమేష్, ఇంద్రకరణ్‌రెడ్డి, నరేందర్, గొల్లదేవేందర్, జాని, మురళి పాల్గొన్నారు.



హద్దులను గుర్తిస్తున్న దృశ్యం

ముథోల్‌లో పోలీసుల కవాతు



కవాతు చేస్తున్న పోలీసులు

ముథోల్, జనవరి 30 : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో శాంతిభద్రతలో భాగంగా మంగళవారం సాయంత్రం సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. స్థానిక పోలీసుస్టేషన్ నుంచి బస్టాండ్ మీదుగా ఆయా గల్లీల్లో కవాతు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయికిరణ్, మోహన్ రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల విక్రయాలు

కేటాయించిన స్థలంలోనే చేయాలి : ఈశ్వర్



విక్రయదారులతో మాట్లాడుతున్న ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, జనవరి 30 : నిర్మల్ పట్టణంలోని కూరగాయలు విక్రయించేవారు తమకు కేటాయించిన స్థలంలోనే జరుపాలని, వ్యాపారాలు చేసుకోవాలని చైర్మన్ ఈశ్వర్ అన్నారు. మంగళవారం ఇంద్రానగర్‌లోని కూరగాయల మార్కెట్‌ను ఆయన అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల నుంచి కూరగాయలు అమ్మేందుకు వచ్చిన విక్రయదారులు తమకు కేటాయించిన స్థలాల్లో జరుపాలన్నారు. రోడ్డుపై వ్యాపారాలు చేయొద్దని సూచించారు. డీఈ జాదవ్ సంతోష్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ దేవిదాస్ ఉన్నారు.

మాజీ మంత్రికి నివాళులు

నిర్మల్ కల్చరల్, జనవరి 30 : మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దివంగత ప్రొద్దుటూరి నర్సారెడ్డికి తెలంగాణ రచయితల వేదిక గౌరవ అధ్యక్షుడు డాక్టర్ దామెర రాములు నివాళులర్పించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో నిర్మల్ జిల్లా ఓ మహోన్నత నాయకుడిని కోల్పోయిందని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కథా ప్రక్రియపై విస్తృతోపన్యాసం

నిర్మల్ కల్చరల్, జనవరి 30 : కథా ప్రక్రియపై మంగళవారం డిగ్రీ కళాశాలలో ప్రముఖ రచయిత, వ్యాసకర్త డాక్టర్ సంపత్ కుమార్ విద్యార్థులకు విస్తృతోపన్యాయం చేశారు. ప్రిన్సిపాల్ భీమ్‌రావు రచయితను సన్మానించారు. అధ్యాపకులు డాక్టర్ శంకర్, పీజీ రెడ్డి, రజిత, రంజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



పెంద్రం సుంగు మృతదేహం

దస్తూరాబాద్, జనవరి 30 : అనుమనాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని మల్లాపూర్ గ్రామ పంచాయతీలోని గోండుగూడ గ్రామానికి చెందిన పెంద్రం సుంగు (45) సోమవారం రాత్రి మల్లాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొలం వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. అతడి ఫోన్ కలవకపోవడంతో కుటుంబికులు పొలానికి వెళ్లి చూడగా సుంగు అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. మోటార్ సమీపంలో మృత దేహం ఉండడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

విద్యార్థుల కోసం బస్సు నడపాలి

- ఎంపీటీసీ దేవోజి భూమేష్

ముథోల్, జనవరి 30 : విద్యార్థుల కోసం ఆర్టీసీ అధికారులు బస్సులను నడపాలని ముథోల్ ఎంపీటీసీ దేవోజి భూమేష్ అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ముథోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కళాశాలలో విద్యను అభ్యసించడానికి పక్క మండలం అయిన తానూర్ మండలంలోని దౌలతాబాద్, కర్బాల, దహగాంతో పాటు ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు ప్రతి రోజు రాకపోకలు కొనసాగిస్తున్నారన్నారని తెలిపారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల పనిచేసే దినాల్లో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ముథోల్ నుండి ఆయా గ్రామాలకు ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. బస్సులు నడపకపోవటంతో విద్యార్థులు, విద్యార్థినులకు ఇబ్బందులు తప్పటం లేదన్నారు. అధికారులు స్పందించి విద్యార్థుల సౌకర్యార్థం బస్సును నడపాలని కోరారు. బస్సులు లేకపోవడంతో ప్రత్యామ్నాయాలపై ఆధార పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. బస్సుపాసు ఉన్నప్పటికి ఆటోచార్జీలు పెట్టుకుని ప్రయాణిస్తున్నారన్నారు.

విపత్తు సమయంలో రక్షణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నిర్మల్ కల్చరల్, జనవరి 30 : ప్రకృతి విపత్తుల సమయంలో తమకు తాము ఇతరులను ఎలా సంరక్షించాలో స్థానిక వైఎస్ఆర్ కాలనీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఎన్‌డీఆర్ఎఫ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ పింటు నంది మాట్లాడుతూ... ప్రకృతి విపత్తు, వరదలు, తుఫాన్, భూకంపాలు, రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. నీటిలో మునిగిన వ్యక్తికి ప్రథమ చికిత్స, గ్యాస్ లీకేజీ, తదితర వాటిని ఎలా అరికట్టాలి అనే అంశాలపై ప్రదర్శనలు నిర్వహించారు. తహసీల్దార్ మల్లేష్, డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, ఆర్ఐ వెంకట రమణ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

నెహ్రూ యువకేంద్ర సభ్యుడిగా

వెంకటేష్ నియామకం



వెంకటేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, జనవరి 30 : నెహ్రూ యువకేంద్రం నిర్మల్ జిల్లా కమిటీ అడ్వైజరీ సభ్యుడిగా కుమ్మరి వెంకటేష్ నియమితులయ్యారు. కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఈ మేరకు నామినేట్ చేయగా నెహ్రూ యువ కేంద్ర డైరెక్టర్ జనరల్ నితేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు శ్రావణ్‌రెడ్డి, ప్రభాకర్, భూమేష్, అరవింద్ సన్మానించారు.

కుష్టువ్యాధి గుర్తింపు ఉద్యమంలా చేపట్టాలి

● పక్షోత్సవాలు ప్రారంభం



కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

నిర్మల్ కల్చరల్, జనవరి 30 : కుష్టువ్యాధిని గుర్తించడం ఉద్యమంలా చేపట్టాలని ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రాంనగర్‌లోని ఎస్టీ బాలికల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 30 నుండి ఫిబ్రవరి 13 వరకు జాతీయ కుష్టు నిర్మూలన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యాధిగ్రస్తులను తొందరగా గుర్తించి చికిత్సలు అందిస్తే అంగవైకల్యం కలుగకుండా నివారించ వచ్చునని తెలిపారు. కుష్టు వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదని వారు పూర్తిగా చికిత్సలు చేయించుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ శ్వేత, మెడికల్ ఆఫీసర్ వినోద్‌కుమార్, రాజేశ్వర్, రమణ, మతిన్, కమల, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో గిరిజనేతరులకు ఇన్‌చార్జి సర్పంచ్‌లుగా దక్కిన అవకాశం

ఉట్నూర్, జనవరి 30: ఏజెన్సీ ప్రాంతాలలో సర్పంచులుగా ఎన్నిక కావాలంటే గిరిజనులకే అవకాశాలు ఉండడంతో గిరిజనేతరులు సర్పంచులుగా ఎన్నిక అవుతున్నారు. కానీ వారు తప్పులు చేసిన ఫలితంగా పదవులు కోల్పోవడంతో కొంతమంది గిరిజనేతరులకు ఇన్‌చార్జి సర్పంచ్‌లుగా కొనసాగే అవకాశం లభించింది. ఐదేళ్ల క్రితం జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఉట్నూర్ మండలంలోని చాందూరి సర్పంచ్‌గా సీతేశ్వర్ ఎన్నికయ్యారు. కానీ ఆయన ఎన్నికపై ఓటమి చెవి చూసిన సర్పంచ్ జిల్లా అధికారులను ఆచరించడంతో పాటు ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించగా.. గిరిజనుడు కాని వ్యక్తి సర్పంచుగా ఎన్నికైనందున ఆయన సర్పంచ్ పదవి నుంచి తొలగింపునకు గురయ్యాడు. దీంతో చాందూరి ఉప సర్పంచ్‌గా ఎన్నికైన ప్రకాష్‌ను జిల్లా అధికారులు ఇన్‌చార్జి సర్పంచ్‌గా అవకాశం కల్పించారు. అదేవిధంగా హస్నాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జాదవ్ ఉపేందర్ పంచాయతీకి సంబంధించిన నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని భావించి విచారణ పూర్తి చేసిన కలెక్టర్.. ఆయనను సర్పంచ్ పదవి నుంచి తొలగించడంతో ఉప సర్పంచ్ నేదునూరి అశోక్ ఇన్‌చార్జి సర్పంచ్‌గా నియామకమయ్యారు. అలాగే షాంపూర్ సర్పంచ్ మల్లిక అధిక సంతానం ఉన్నారని వచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ సస్పెండ్ చేయడంతో.. అక్కడ ఎన్నికైన ఉప సర్పంచ్ కేశవ్ ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇలా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు ముగ్గురికి అనూహ్యంగా పదవి లభించడం గమనార్హం.

చెడు అలవాట్లను దూరం చేసే కార్యక్రమాలు నిర్వహించాలని : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 30: ఏఐవైఎఫ్ నాయకులు ఆదిలాబాద్ జిల్లాలో విద్యార్థి యువత చెడు అలవాట్లు దూరం చేసే మంచి కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. ఈ సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా డీపీవో కార్యాలయంలో ఎస్పీ గౌస్ ఆలం చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఇందులో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఆర్.జాషువ, మెస్రం భాస్కర్‌లు సంయుక్తంగా మాట్లాడుతూ యువజన, విద్యార్థి సమస్యల పరిష్కార అజెండానే ఏఐవైఎఫ్ ప్రధాన కర్తవ్యం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాల భర్తీ జరపాలని, గత పాలకులతో విసుగు చెందిన యువత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నిరుద్యోగుల పక్షాన నిలవాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇందులో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు గేడందీపక్, పెందూర్ తుకారం, కనక దత్తు,సురేష్, ఏఎస్‌యూ సలాం, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ప్రదీప్‌కుమార్ గౌడ్

'రోడ్డు భద్రత నియమాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి'

సిరికొండ, జనవరి 30: రోడ్డు భద్రత నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ ప్రదీప్ కుమార్‌గౌడ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో 85 శాతం మంది ద్విచక్ర వాహనలపై ప్రయాణిస్తున్న వారు.. హెల్మెట్ లేని కారణంగా మృత్యువాత పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల కాలంలో రోగాల బారినపడి మృతి చెందే వారి కన్న.. ప్రమాదాలతో మృతి చెందే వారి సంఖ్య పెరిగిందన్నారు. వాహనదారులు నిర్లక్ష్యంగా వాహనం నడపడం ద్వారా ప్రమాదాలకు గురికావడంతో పాటు ఎదురుగా వెళ్తున్న వ్యక్తి కూడా ప్రమాదాల్లో పడే అవకాశం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఒక కుటుంబాన్ని పోషించే వ్యక్తి ప్రమాదానికి గురైతే ఆ కుటుంబమే వీధిన పడే అవకాశం ఉందని తెలిపారు. రోడ్డు భద్రత అనేది ప్రతి క్షణం, ప్రతి నిమిషం, ప్రతి రోజు అవసరమని వాటిని నిర్లక్ష్యం చేస్తే మనతోపాటు ఎదుటివారి ప్రాణాలు కూడా తీసినవారమవుతామని అన్నారు. అంతేకాకుండా ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి, వేగాన్ని నియంత్రించుకుంటూ ప్రయాణాలు చేసినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించగలమన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీల్, ఆర్‌బీఎస్కే డాక్టర్ నరేష్, వైద్య సిబ్బంది గంగారాం, సుశీల, పాఠశాల ఉపాధ్యాయులు కాంతయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

● ఆదిలాబాద్ ఎస్పీ గౌస్‌ఆలం ● జిల్లాకేంద్రంలో జాతీయ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ● నివాళ్లర్పించిన పోలీసులు


మౌనం పాటిస్తున్న జిల్లా ఎస్పీ, అధికారులు


మాట్లాడుతున్న ఎస్పీ గౌస్‌ఆలం

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 30: కేంద్ర హోంశాఖ నిర్దేశం మేరకు జాతీయ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అధ్యక్షతన ఉదయం 11 గంటలకు క్రమశిక్షణతో రెండు నిమిషాల పాటు జిల్లా కార్యాలయం అధికారులు, సిబ్బంది కలిసి మౌనం పాటించారు. జిల్లా ఎస్పీ గౌస్ ఆలం సూచన మేరకు జిల్లాలోని అన్ని పోలీసు కార్యాలయాలు, పోలీసు స్టేషన్‌ల సిబ్బంది ఉదయం 11 గంటలకు రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం పోలీసు కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి కలిసి కట్టుగా అందరు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అదే విధంగా గాంధీజి వర్ధంతి సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రతియేటా జనవరి 30న భారతదేశమంతా ఈ కార్యక్రమాన్ని జరుపుకోవడం ఆనవాయితిగా వస్తుందని పేర్కొన్నారు. దేశభద్రత, ప్రజల రక్షణ కోసం పోలీసులు తమ ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా అర్పిస్తు ఉంటారని కొనియాడారు. అమరవీరులను స్మరించుకోవడందేశపౌరుల బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, కార్యాలయం ఏఓ భక్త ప్రహ్లాద్,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నవీన్, మురళి సూపరింటెండెంట్లు సంజీవ్, గంగాధర్, సీసీ దుర్గం శ్రీనివాస్, ఫింగర్‌ప్రింట్ నిపుణులు శ్రీనివాస్, సెక్షన్ అధికారులు టి.మురళి మోహన్, పోలీసు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, కార్యదర్శి గిన్నెల సత్యనారాయణ, ఐటీ కోర్ నిపుణులు సంజీవ్, ఎంఎ రియాజ్, డీసీఆర్‌బీ ఎస్సై ఎంఎ హాకీం, హెడ్ కానిస్టేబుల్ అతావుల్లాఖాన్, మహిళ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్, ఉద్యోగులు


ఐటీడీఏలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

జాతిపిత మహాత్మాగాంధీకి ఘన నివాళి

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 30: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులను స్మరించుకుంటు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లోని అదనపుకలెక్టర్ శ్యామలదేవి చాంబర్‌లో సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులుపాల్గొని స్వాతంత్రోద్యమ అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామనే దృడ సంకల్పంతో వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ స్రవంతి, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీపీఆర్‌వో విష్ణువర్ధన్, ఈడీఎం రవి కుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాంరెడ్డి, నలంద ప్రియా, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అశోక్, నవీన్, అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉట్నూర్: దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహాత్మాగాంధీ సేవలు మరువలేనివని ఉట్నూర్ ఐటీడీఏ ఏపీఓ జనరల్ కినక భీమ్‌రావ్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పీవీటీజీ ఏపీవో ఆత్రం భాస్కర్, పరిపాలన అధికారి సున్నం రాంబాబు, జేడీఎం నాగభూషణం, మేనేజర్ భీమ్, పెస జిల్లా కోఆర్డినేటర్ వసంతరావు, శ్యామల, ఏరుకొండ రాజన్న, తదితరులు పాల్గొన్నారు.


లచ్చింపూర్‌లో పశువులకు టీకాలు వేస్తున్న అధికారులు


తోషం పాఠశాలలో వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పశు వైద్య అధికారులు

రైతులు పశు పోషణపై దృష్టి సారించాలి

● ఆదిలాబాద్ జిల్లా పశువైద్యాధికారి డా.కిషన్

తలమడుగు, జనవరి 30: రైతులు మరింత ఆర్థిక అభివృద్ధి చెందారని, వ్యవసాయంతో పాటు పశుపోషణపై దృష్టి సారించాలని ఆదిలాబాద్ జిల్లా పశువైద్యాధికారి డా.కిషన్ కోరారు. మంగళవారం మండలంలోని లచ్చింపూర్ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భగా జిల్లా అధికారి కిషన్ మాట్లాడుతూ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం వారి నికరా ప్రాజెక్టు కింద వారి సౌజన్యంతో, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం, గర్భకోశ వ్యాధి నివారణ కార్యక్రమం తలమడుగు మండలంలో లక్ష్మీపూర్ గ్రామం దత్తత తీసుకుని డెవలప్‌మెంట్ యాక్టివిటి చేయడం చాలా సంతోషం అన్నారు. అందులో భాగంగానే మండల పశువైద్య అధికారి డాక్టర్ దూద్‌రాం రాథోడ్ పశుగర్భ కోశ వ్యాధి చికిత్స చేసి ఆరోగ్యంతో ఉన్న ఆవులకు ఏకకాలంలో ఎదకు వచ్చేటట్టు చేసి కృత్రిమ గర్భదారణ చేసి దూడలను పొందే కార్యక్రమం చేపట్టడానికి కార్యచరణ చేయడం రైతులు దీన్ని సద్వినియోగంచేసుకోవాలని ఆయన సూచించారు.

● 'జంతువుల సంరక్షణ అందరి బాధ్యత'

గుడిహత్నూర్: జంతువుల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా పశు సంవర్ధన శాఖ, పశువైద్యాధికారి డా.కిషన్ అన్నారు. మంగళవారం మండలంలోని తోషం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతు సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జంతువుల సంక్షేమం కోసం ప్రభుత్వం జంతు హింస నివారణ చట్టం తెచ్చిందని, ఆ చట్టాన్ని ప్రతి పౌరుడు తప్పక తెలుసుకోవాలన్నారు. జంతువులు, పక్షులను, నీటిలో జీవించే జీవులను హింసించినా, చట్టప్రకారం జంతు సంక్షేమబోర్డు శిక్షిస్తుందన్నారు. అనంతరం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు రాథోడ్ రామారావ్, మండల పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్, సిబ్బంది రాజేశ్వర్, విశాల్, అరవింద్, కిరణ్, భూమన్న, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రత్నప్రభ

రక్తహీనతపై ప్రత్యేక దృష్టి

● భీంపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ రాజ్

భీంపూర్, జనవరి 30: ఆదివాసీ గ్రామాల్లో రక్తహీనత, సికిల్ సెల్ గురించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని భీంపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ రాజ్ అన్నారు. మంగళవారం భీంపూర్ రైతు వేదికలో సర్వసభ్య సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు సర్కారు ఆసుపత్రులలోనే కాన్పులు జరిగేలా సిబ్బంది, ప్రజా ప్రతినిధులు అవగాహన కల్పించారన్నారు. వ్యవసాయ అధికారి రవీందర్ మాట్లాడుతూ మండలాల్లో ఇప్పటి వరకు 3829 మందికి రైతులకు మూడు ఎకరాలకు సంబంధించి రూ.3కోట్ల 98లక్షల రైతుబంధు జమా అయ్యిందన్నారు. విద్యుత్ శాఖ అధికారి శ్రావణ్ మాట్లాడుతూ బిల్లులు పెండింగ్ లేని వారికి గృహ జ్యోతి వస్తుందన్నారు. అటవీ శాఖ అధికారి గులాబ్ మాట్లాడుతూ అటవీ సంరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. ఇదిలా ఉంటే ఈ ఐదు ఏళ్లకు సంబంధించి సర్పంచ్‌లకు ఇది చివరి సమావేశం కావడంతో సర్పంచ్‌లందరినీ సన్మానించారు. ఇందులో ఎంపీపీ కుడిమేత రత్న ప్రభ సంతోష్, జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, ఎంపీడీవో శ్రీనివాస్, ఇన్‌చార్జి తహసీల్దార్ హరిదాసు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళాజాత

ఇంద్రవెల్లి, జనవరి 30: మండల కేంద్రంలోని స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద జిల్లా సమాచారం పౌర సంబంధాల శాఖ సౌజన్యంతో తెలంగాణ సంస్కృతిక సారధి కళాజాత బృందం ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా పాలన ఆరు గ్యారంటీలపై అవగహన కల్పించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : ఎంపీపీ

ఇంద్రవెల్లి, జనవరి 30: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఎంపీపీ శోభాబాయి సూచించారు. ఆమె అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించగా, ఎంపీడీవో పుష్పలత, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారులు పరిష్కరించాలని సూచించారు. విద్యాశాఖ, వ్యవసాయ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ, వైద్య ఆరోగ్య శాఖ, పశువైద్య శాఖల అధికారులు తమతమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నారాయణ, ఐకేపీ ఏపీఎం రాథోడ్ రామారావు, ఎంపీవో సంతోష్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చట్టబద్ధతలేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి : తుడుందెబ్బ

బోథ్, జనవరి 30: చట్టబద్దత లేకుండా ఎస్టీ జాబితాలో కలిపిన లంబాడాలను ప్రభుత్వం వెంటనే ఎస్టీ జాబితాను తొలగించాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు గోడం గణేష్ డిమాండ్ చేశారు. మంగళవారం బోథ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చెందినటువంటి 11 కులాల వారిని ఎస్టీ జాబితాలో కలుపుతూ చేసిన అసెంబ్లీ తీర్మానాన్ని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివాసులు సాగు చేస్తున్న పోడు భూములకు ఎటువంటి షరతులు లేకుండా హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. ఆదివాసీల నిరుద్యోగ సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు ఈ సందర్భంగా కోరారు. అంతేకాకుండా ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకుని ఇంద్రవెల్లిలో జరిగే సభలో తగు ప్రకటన చేయాలని కోరారు. అంతేగాక రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసికి టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసి గూడెలకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కడప నగేష్, జిల్లా ఉపాధ్యక్షులు రామల్లి భోజన్న, జిల్లా సలహాదారు పందరం శంకర్, బోథ్ డివిజన్ అధ్యక్షులు ధ్రువ విశ్వేశ్వరరావు, ఐటీడీఏ డైరెక్టర్ మిశ్రం భూమన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుడాల స్వామి, తుడుం దెబ్బ మండల ఉపాధ్యక్షుడు మంగారపు మహేష్, శిడం మారుతి, తదితరులు పాల్గొన్నారు.



● చెరువుగూడెంలో నిర్మాణంలో ఉన్న కోలాం గిరిజనుల గృహం



● కోలాం గిరిజనుడి గృహంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్

అభివృద్ధికి దూరంగా.. ఆదివాసీలు

- ఉమ్మడి జిల్లాలో కరెంట్ లేని ఆదివాసీ గిరిజన గ్రామాలు 32
- ఐదు దశాబ్దాల క్రితం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఏర్పాటు
- అయినా ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి అంతంత మాత్రమే..
- ఇప్పటికీ కొండకోనల్లో రహదారులు సైతం లేని మారుమూల గ్రామాలు
- గత బీఆర్ఎస్ పాలనలో నిర్మాణానికి నోచుకోని గృహాలు
- కేంద్రం చొరవతో గృహాల మంజూరు
- కరెంట్ లేని గ్రామాలకు సోలార్ వెలుగులు
- ఉమ్మడి జిల్లాలోని మొత్తం 177 గ్రామాల్లో జీవిస్తున్న కొలాం, తోటి గిరిజనులు

ఉట్నూర్, జనవరి 30: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు గడుస్తున్నా.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గిరిజనులు అడవులకే పరిమితమై జీవిస్తున్నారు. ఆదిమ గిరిజనులు ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల అభివృద్ధి కోసం ఐదు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ద్వారా కూడా గిరిజనుల అభివృద్ధి అంతంత మాత్రమే అయ్యింది. ఉమ్మడి జిల్లాలోని 177 గ్రామాలలో ఆదిమ గిరిజనులైన కొలాం, తోటి గిరిజనులు జీవిస్తున్నారు. కొండకోనల్లో రహదారులు సైతం లేని మారుమూల గ్రామాలలో ఏరి పారేసినట్లు ఆదిమ గిరిజనులు జీవిస్తున్నారు. కోలాం గిరిజనులు బుట్టలు, తడకలు అల్లుతూ పోడు వ్యవసాయం చేస్తూ జీవనోపాధి పొందుతుండగా, తోటి గిరిజనులు సంచార జీవనం సాగిస్తూ గిరిజన గ్రామాలలో గోండుల ఇళ్లలో కథలు చెబుతూ వారు ఇచ్చే ధాన్యంతో జీవిస్తూ వస్తున్నారు. ఇప్పుడిప్పుడే కొందరు ఆదిమ గిరిజనులు తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలలో చేర్పి చదివిస్తున్నారు. ఈ గ్రామాలకు రోడ్లు, తాగునీరు, అలాగే వ్యవసాయ భూములకు సాగునీరు, విద్యుత్ సౌకర్యం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కరెంట్ లేని గ్రామాలు 32

ఆదిమ గిరిజనులు జీవిస్తున్న అటవీ ప్రాంతాలలో 32 గ్రామాలకు నేటికీ విద్యుత్ సౌకర్యం లేదు. జిల్లాలోని ఇంద్రవెల్లి మండలం శాంతిగూడ రామగూడ, సిరికొండ మండలం ధర్మాన్నపేట్ బుర్సిగుట్ట, ఉట్నూర్ మండలం మారుతిగూడ, సెంటర్‌గూడా, ఒంటిమామిడి, ఎర్రగుట్ట ధర్మాజీపేట్, శాంతాపూర్, రాజులగూడ-2, మావల మండలం మాలేపూర్, ఆదిలాబాద్ మండలం నిషానిగుట్ట, నార్నూర్ మండలం బొజ్జుగూడ, గాదిగూడ మండలం న్యూభీమ్జిగూడ, జైనూర్ మండలం దేవుగూడా, లామ్‌పటార్, కెరమెరి మండలం రాజులగూడ, పాట్నాపూర్, వాంకిడి మండలం తాటిగూడ, జోలపాటార్, జోగాపూర్, ఆసిఫాబాద్ మండలం మాన్కాపూర్ కాలనీ, అన్నారం, దేవదుర్గం, చింతగూడ (యపాల్పటి), తిర్యాని మండలం కుర్సుగూడ, బురదమడుగు, దోనికి, సిర్పూర్ టి మండలం ఏంపల్లి కోలాగూడం, కాగజ్‌నగర్ మండలం కోలంగొంది, పెంబి మండలం గుమ్మెన కొలంగూడ లాంటి ఆదిమ గిరిజనులు జీవిస్తున్న గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కరువైంది.

బీఆర్ఎస్ పాలనలో కరువైన ఇళ్లు

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక అధికారంలోకి వచ్చిన భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ఇళ్లు లేని వారికి ఇళ్లు కేటాయించడంలో పూర్తిగా విఫలమైంది. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన డబుల్‌బెడ్ రూం గృహాల నిర్మాణాలు కొందరికి పరిమితం కాగా, అలాగే ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో నిర్మించిన కొన్ని గృహాలకూ లబ్ధిదారులను ఎంపిక చేయడంలో పాలకులు విఫలమయ్యారు.

రూ.25 కోట్లతో గృహాల మంజూరు

రాష్ట్ర ప్రభుత్వం ఆదిమ గిరిజనుల సంక్షేమానికి నిధులు ఇవ్వడం లేదని భావించిన కేంద్ర ప్రభుత్వంగత యేడాది నుంచి స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ (ఎస్‌సీఏ) పథకం ద్వారా రూ.25 కోట్లు ఐటీడీఏకు రూ.25 కోట్లు మంజూరు చేసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొలాం, తోటి గిరిజనులకు వెయ్యి గృహాలు నిర్మించాలని ఆదేశించింది. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, గాదిగూడ, సిరికొండ, గుడిహత్నూర్, తలమడుగు, తాంసి, భీంపూర్ బేల, మావల, జైనథ్, ఆదిలాబాద్ మండలాల్లో కోలాం, తోటి గిరిజనులను గుర్తించారు. ఆదిలాబాద్ జిల్లాలో 105 గ్రామాలలో 486 మందికి, ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్, ఆసిఫాబాద్, లింగాపూర్, వాంకిడి, తిర్యాని మండలాల్లో 296 మంది, మంచిర్యాల జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్షెటిపేట, తాండూరు, కాసిపేట మండలంలో 128 మందిని నిర్మల్ జిల్లాలో పెంబి, ఖానాపూర్, మామడ, నిర్మల్, సారంగాపూర్ మం డలాల్లో 90 మంది లాభోక్తులకు గృహాలు మంజూరు చేశారు. ఒక్కొక్క ఇంటికి రూ.2.50 లక్షలు కేటాయించడంతో పాటు ఆయా గ్రామాలలో ఇళ్లు అత్యవసరం అయిన లబ్ధిదారులను గ్రామసభల ద్వారా గ్రామస్థులు గుర్తించిన వారికి ఇళ్లు మంజూరు చేయడంతో లాభోక్తులు తమ ఇళ్ల పనులను చేసుకుంటున్నారు. అంతేకాకుండా ఉట్నూర్ మండలంలోని చెరువగూడెం, మొర్రిపేట్, జెండాగూడ, లక్కారం, నవోదయనగర్, కుమ్మరికుంట, సోనాపూర్, కోలాంగూడ, మానిగూడ, రాజంపేట, బొప్పరికుంట, ధర్మాజిపేట్‌లలో గృహాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

32 గ్రామాలకు సోలార్ వెలుగులు

ఉమ్మడి జిల్లాలో కరెంట్ లేని 32 గ్రామాల గిరిజనులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రభుత్వం సోలార్ వెలుగులను అందుబాటులోకి తెచ్చింది, 32 గ్రామాలలో 800 మంది కోలాం, తోటి గిరిజన కుటుంబాలు జీవిస్తున్నట్లు గుర్తించి ఒక్కొక్క ఇంటికి రూ.68.49 లక్షలు వెచ్చించి తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణ ఇందన వనరుల అభివృద్ధికి (టెట్కో) సంస్థ ద్వారా సోలార్ వెలుగులు కల్పించారు. ఐదేళ్ల పాటు సోలార్ విద్యుత్ దీపాలకు ఎలాంటి మరమ్మతులు వచ్చిన టెట్కో సంస్థ ఆధ్వర్యంలో చూసేలా షరతులు విధించారు.

ఇల్లు నిర్మించుకుంటున్నా..

: ఆత్రం లక్ష్మణ్, లబ్ధిదారుడు, చెరువుగూడ



ఉట్నూర్ మండలంలోని చెరువుగూడలో ఆరు ఇళ్లు మంజూరయ్యాయి. అయితే, నాకు పూరిగుడిసె ఉండడంతో గ్రామసభలో గ్రామస్థులందరూ నాకు ఇల్లు మంజూరు చేయాలని ప్రతిపాదించడంతో.. అధికారులు ఇల్లు మంజూరు చేశారు. రూ.2.50లక్షలు మంజూరు చేస్తున్నందున నేను నా భార్య కలిసి మేస్త్రీని పెట్టి ఇంటి నిర్మాణం చేయించుకుంటున్నా.

ఉమ్మడి జిల్లాకు వెయ్యి ఇళ్లు మంజూరు

: ఆత్రం భాస్కర్, పీవీటీజీ ఏపీవో, ఐటీడీఏ, ఉట్నూర్



కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు వెయ్యి ఇళ్లు కోలాం, తోటి గిరిజనుల కోసం మంజూరు చేసింది. ఈ ఇళ్ల నిర్మాణం కోసం రూ.25కోట్లు మంజూరు చేసినప్పటికీ.. ఇప్పటి వరకు రూ.8.56 కోట్లు విడుదల అయ్యాయి. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణం పురోగతిలో ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన పీఎం జన్మన్ పథకం ద్వారా ఇళ్లు లేని కోలాం, తోటి గిరిజనులకు ఇళ్లు మంజూరు చేస్తాం.

సంక్షిప్త సమాచారం



అంగన్‌వాడీలో సరుకులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 30: కేఆర్‌కే కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే పాయల శంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం గర్భిణులకు, నవజాత శిశువులకు సరఫరా చేసే ఆహార పదార్థాలు గుడ్లు తనిఖీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మహిళా శిశు సంక్షేమ శాఖ కోసం కొన్ని ప్రత్యేక పథకాలను అందిస్తున్నాయని అన్నారు. ఐసీడీఎస్ అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కై నాణ్యత లేని సరుకులను సరఫరా చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. పౌల్ట్రీ ఫాంలలో రిజెక్ట్ అయిన గుడ్లు, నాణ్యతలేని న్యూట్రిషన్ సప్లయ్ అవుతున్నాయని, ఈ వ్యవహారం నడిపిస్తున్న కాంట్రాక్టర్లు అధికారులపై చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. ఇందులో బీజేపీ నాయకులు జోగి రవి, వేదవ్యాస్, రాజేశ్, సాయి, ముకుంద్, రాజు, గంగుబాయి, స్వప్న, ఆనంద్, రాము, కర్ణాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

5వరకు పత్తి కొనుగోళ్ల నిలిపివేత

బోథ్, జనవరి 30: బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని బోథ్, పొచ్చెర జిన్నింగ్‌లలో ఫిబ్రవరి 1 నుంచి 5వరకు సీసీఐ ఆధ్వర్యం పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ సెక్రటరీ దేవన్న, సూపర్ వైజర్ స్వామిలు తెలిపారు. తిరిగి 6న కొనుగోళ్ల ప్రారంభమవుతాయని, రైతు విషయాన్ని గమనించి పత్తిని మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు.

షాదీముబారక్ చెక్కుల పంపిణీ

నేరడిగొండ, జనవరి 30: మండలకేంద్రానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు తమ సొంత నివాస గృహంలో షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ తనచేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం చించోలి గ్రామానికి చెందిన కుడ్మెత జంగుబాయ్ కుటుంబానికి గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జంగుబాయి కుటుంబానికి రూ.4లక్షలను ప్రభుత్వ తరపున ఎమ్మెల్యే పరిహారం రూపంలో అందించారు. ఇందులో ర.3 లక్షలు జంగుబాయ్ కుమారుడి పేరు మీద ఫిక్స్ డిపాజిట్ చేయడానికి, మరో లక్ష రూపాయలను ఆయన వ్యక్తిగత అవసరాలకు అందించామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచ్ పెంట వెంకట రమణ, సర్పంచ్ జంగు, సద్దాం, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంఆర్ఐ నాగోరావు, తదితరులున్నారు.



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్

దోడందాకు చేరిన గంగాజల పాదయాత్ర

- మర్రి చెట్టు వద్దకు చేరనున్న మెస్రం వంశీయులు
- గ్రామ పొలిమేరలోని ఓ చెట్టుపై గంగాజలం భద్రపరిచిన ఆదివాసీ గిరిజనులు
- వచ్చే నెల 5న ఇంద్రాయి దేవతకు పూజలు
- 9న నాగోబా మహాపూజతో ప్రారంభం కానున్న నాగోబా జాతర



ఎత్మసూర్ నగర్‌లో పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు



పవిత్ర గంగాజలంతో దోడందాకు చేరిన మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి, జనవరి 30: ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా దేవతకు పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని వచ్చేనెల 9న మెస్రం వంశీయులు నాగోబా మహాపూజలతో ప్రారంభించనున్నట్లు మెస్రం వంశీయులు తెలిపారు. కేస్లాపూర్ నాగోబా మహాపూజకు అవసరమగు పవిత్రమైన గంగాజలం కోసం ఈనెల 21న కేస్లాపూర్ నుంచి బయలుదేరామని, ఈనెల 28న జన్నారం మండలంలోని గోదావరి హస్తినమడుగు వద్ద ప్రత్యేక పూజలు, మధ్య పవిత్ర గంగాజలం సేకరించారు. కాగా, మంగళవారం ఉట్నూర్ మండలం నర్సాపూర్ గ్రామ పొలిమేరలో కొద్దిసేపు నిలకడ చేసి.. సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం అక్కడి నుంచి గంగా జలంతో దోడందకు బయలుదేరారు. గ్రామ పొలిమేరలోని ఓ చెట్టుపై పవిత్ర గంగాజలం కలశాన్ని భద్రపరిచారు. తర్వాత కలశానికి మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. మెస్రం వంశబుూయులు గంగాజలంతో బుధవారం వచ్చే ఈనెల 4వరకు దోడంద గ్రామంలో ఉంటున్నట్లు మెస్రం వంశీయులు తెలిపారు. మెస్రం వంశీయులు తమతమ గ్రామాలకు వెళ్లిపోయారు. వచ్చే నెల 5న దోడంద నుంచి మండల కేంద్రంలోని ఇంద్రాయి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేసి.. అదేరోజు రాత్రి కేస్లాపూర్ గ్రామ సమీపంలో గల మర్రి చెట్టు వద్దకు చేరి బస చేయనున్నారు. మర్రి చెట్టు వద్ద మూడు రోజుల సంప్రదాయ పూజలు చేయనున్నట్లు మెస్రం వంశీయులు తెలిపారు. వచ్చేనెలా 9న పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని అర్ధరాత్రి పవిత్ర గంగాజలంతో నాగోబా దేవతకు జలాభిషేకం, మహాపూజ నిర్వహించి నాగోబా జాతరను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందులో కటోడ మెస్రం కోసు, కటోడ మెస్రం కోసేరావు, ప్రర్ధాంజి మెస్రం దాదారావు, మెస్రం తిరుపతి, తదితరులున్నారు.

● ఉట్నూర్ నుంచి బయలుదేరిన మెస్రం గిరిజనులు

ఉట్నూర్: జన్నారం మండలం కలమడుగు గోదావరిలోని హస్తినమడుగులో గోదావరి పవిత్ర జలాలు సేకరించిన మెస్రం వంశీయులు మంగళవారం ఉట్నూర్ నుంచి ఇంద్రవెల్లి దోడందా గ్రామానికి పాదయాత్ర ప్రారంభించారు. సోమవారం రాత్రి ఉట్నూర్‌లోని ఏతిమసూర్ నగర్‌లో పవిత్ర గంగాజలాల కలశానికి పూజలు చేసిన అనంతరం ఇంద్రవెల్లి వైపు పాదయాత్ర నిర్వహించారు. మార్గ మధ్యంలో రామ్ లింగంపేట వద్ద మెస్రం కేశవ్‌రావు కుటుంబ సభ్యులు మెస్రం వంశీయులకు అతిథ్యం అందించారు. భోజనాల అనంతరం మెస్రం గిరిజనులు దొడందా వైపు కదిలారు. ఇందులో ప్రధాన్ దాదారావు, కోసు, కటోడా కోసేరావ్, గాయకి దేవరావు, రుద్యాబొజ్జు, ధర్మ, షాందూర్‌శావ్, జంగు, శేఖు, నాగోబాపెన్ కొత్వాల్ మెస్రం తిరుపతి, తదితరులు ఉన్నారు.



పవిత్ర గంగాజలం కలశంతో కటోడ మెస్రం కోసు



గ్రామ పొలిమేరలోని ఓ చెట్టుపై గంగాజల కలశాన్ని భద్రపరుస్తున్న దృశ్యం



లిమ్ గౌడలో సమస్యలు తెలుసుకుంటున్న ఖుష్బుగుప్తా

కొలాం గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రం : ఇన్‌చార్జి పీవో

ఇంద్రవెల్లి, జనవరి 30: ప్రభుత్వం అమలు చేసిన ప్రధాన మంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం అమలు కార్యక్రమంలో భాగంగా కొలాం గిరిజనుల ఆధార్ కార్డులు అప్‌డెట్ కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు అదనపు కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బుగుప్తా అన్నారు. మంగళవారం మండలంలోని లిమ్‌గూడ గ్రామాన్ని సందర్శించారు. కొలాం గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలు, స్థితిగతులు, జీవన విధానం, గ్రామంలో జరిగిన అభివృద్ధి ఇంక చేయాల్సిన అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం ద్వారా కొలాం గిరిజన గ్రామాల్లో అన్నిరకాల మౌలిక సదుపాయలు కల్పించడం జరుగుతుందన్నారు. కొలాం గిరిజనులు ప్రతిఒక్కరూ ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న ఆధార్ కేంద్రంలో ఆధార్ అప్‌డెట్ చేయించుకోవాలని సూచించారు.

'వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలి'

ఉట్నూర్, జనవరి 30: వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలని, అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసి, ప్రాంతీయ వివక్షతను రూపుమాపాలని యూనివర్సిటీ, రైల్వేలైన్, సాగు, తాగునీరు సాధన కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. జిల్లాలో అత్యంత వెనుకబడిన ఏజెన్సీ ఉట్నూర్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని, పాలకులకు కనువిప్పు అయ్యే విధంగా చూడాలన్న ఉద్దేశంతో పట్టణ కేంద్రంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సాధన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కన్వీనర్ భరత్‌చౌహాన్ మాట్లాడుతూ డిమాండ్లను పరిష్కరించే దిశగా ఆదిలాబాద్ నుంచి కేస్లాపూర్ ఇంద్రవెల్లి ఉట్నూర్, జైనూర్ నుంచి జోడేఘాట్ ఆసిఫాబాద్ మీదుగా కాగజ్ నగర్ వరకు రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని పలు డిమాండ్లను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్లు బానోతు రామారావు, కట్ట లక్ష్మణ చారి, జాదవ్ రామకృష్ణ నాయక్, మాజీ సర్పంచ్ బొంత ఆశారెడ్డి, మసూద్, అలీ, ఠాకూర్ వీర్‌సింగ్, రాథోడ్ శేషరావు, నాందేవ్, దారాసింగ్, భుజంగ రావు, లక్ష్మణ్, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించాలి

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 30: కుష్ఠు వ్యాధిపై మరింత అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని హమాలీవాడ పట్టణ ఆరోగ్య కేంద్రంలో కుష్ఠు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి మైక్రో బ్యాక్టీరియమ్ లేప్రే అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందన్నారు. శరీరంపై పాలిపోయిన రాగి రంగు గల మొద్దుబారిన మచ్చలు ఉన్నవారు కుష్ఠు వ్యాధి అని, ఎండీటీ చికిత్సతో ఈ వ్యాధి ఏ దశలోనైనా పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. జిల్లాలో కుష్ఠు వ్యాధి తీవ్రత తక్కువగానే ఉన్నప్పటికీ ప్రతినెలా నూతన కుష్ఠు రోగులు గుర్తించడం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. స్పర్శ్ పక్షోత్సవాల్లో భాగంగా వైద్య సిబ్బంది విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో ఈ వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించాలని కోరారు. కుష్ఠు నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గజానన్ మాట్లాడుతూ ఈ వ్యాధికి అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. అంతకుముందు మహాత్మాగాంధీ వర్ధంతి పురస్కరించుకుని గాంధీ చిత్రపటానికి, కుష్ఠు కారక సూక్ష్మ క్రిమిని కనుగొన్న శాస్త్రవేత్త డాక్టర్ హాన్సన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అందరితో కుష్ఠు నివారణకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన, వైద్యాధికారి అవినాశ్, వార్డు కౌన్సిలర్ కేశవ్, కమ్యూనిటీ ఆర్గనైజర్ రణిత, డిప్యూటీ పారామెడికల్ అధికారులు మధుసూదన్ రావు,వామన్‌రావు, ఎల్‌టీ రమణచారి కిరణ్, నవీన్, సిబ్బంది తదితరులున్నారు.



పాల్గొన్న వైద్య ఆరోగ్య ఉద్యోగులు, సిబ్బంది



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్‌రాథోడ్

● 'కుష్ఠు నిర్మూలనకు ప్రతీఒక్కరు పాటుపడాలి'

బోథ్: కుష్ఠు నిర్మూలనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని సర్పంచ్ సురేందర్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద కుష్ఠు నిర్మూలనపై వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుమంగళ, స్నేహతో పాటు ఎంపీడీవో జీవన్‌రెడ్డి, నాయకులు కట్ట భూమేష్, షేక్ షాకీర్, ఆశా వర్కర్లు యశోద, ప్రమీల, శోభ, పుష్పలత, అరుణ, తదితతరులు పాల్గొన్నారు.